# 'గీతం' మూర్తికి 'గానం' సన్మానం

## అమెరికాలో పూర్వ విద్యార్థుల కార్యక్రమం




మూర్తిని సన్మానిస్తున్న గానం ప్రతినిధి. పక్కనే (ఎడమ) డాక్టర్ మేవ్స్

షికాగో: తెదేపా ఉపాధ్యక్షుడు, గీతం విశ్వవిద్యాలయ అధ్యక్షుడు యం. వి. వి. ఎన్. మూర్తిని ప్రవాసాంధ్రులు ఘనంగా సన్మానించారు. ఆదివారం షికాగోలో జరిగిన సన్మాన కార్యక్రమానికి 'ఉత్తర అమెరికాలో గీతం పూర్వ విద్యార్థుల సంఘం' (గానం) అధ్యక్షుడు వెంకటేష్ వేదుల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గీతం పాలక మండలి సభ్యుడు వెలుకోలు బసవపున్నయ్య రచించిన 'డాక్టర్ మూర్తి జన్మచరిత్ర', 'అమెరికాలో మూర్తిగీతం' గ్రంథాలను అమెరికా వైద్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ మైఖేల్ డి. మేవ్స్ ఆవిష్కరించారు. మూర్తి ప్రసంగిస్తూ బ్రిటిష్ పాలనలో నలిగిన భారతదేశానికి ఆకలి, పేదరికం, వెనుకబాటుతనం మిగిలాయని చెప్పారు. వీటికి పరిష్కారం విద్యలోనే ఉందని భావించి దాని అభివృద్ధికి కృషిచేస్తున్నానని తెలిపారు. పారిశ్రామికవేత్తగా సంపాదించిన సొమ్ముతో విద్యాసంస్థను స్థాపించానన్నారు. ఎన్టీఆర్ పిలుపునందుకొని రాజకీయ జీవితం ప్రారంభించానని తెలిపారు. ప్రవాసాంధ్రులు తమ జన్మభూమి, తాము నివసిస్తున్న భూమి అభివృద్ధికి తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. విశాఖ వచ్చే ప్రవాసాంధ్రుల కోసం గీతం క్యాంపస్‌లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో 'గానం' వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. మేవ్స్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి, బడుగు వర్గాల అభ్యున్నతికి మూర్తి కృషిచేస్తున్నారని కొనియాడారు. భారతీయ సంస్కృతి అపూర్వమైందనీ, దాన్ని అధ్యయనం చేయడానికి తన కుమారుడిని ఆరునెలల పర్యటనకు ఆంధ్రప్రదేశ్‌కు పంపనున్నట్లు తెలిపారు. సభలో తానా కార్యదర్శి తోటకూర ప్రసాద్, మిచిగాన్ రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ ముక్కామల అప్పారావు, షికాగో తెదేపా సమన్వయకర్త రవి అనుమోలు, సన్మాన సంఘం సమన్వయకర్త శ్రీకృష్ణ మతుకుమిల్లి తదితరులు ప్రసంగించారు.